క్లుప్తంగా

నిబంధనల ప్రకారమే మద్యం దుకాణాలు

పెదపూడి: మద్యం దుకాణాలు నిబంధనలు ప్రకారం నిర్వహించాలని కాకినాడ సౌత్ జోన్ ఎక్సైజ్ శాఖ సీఐ టి.నిరంజన్‌రావు తెలిపారు. ఆయన బుధవారం పెదపూడిలో మాట్లాడుతూ మండలంలో ఐదు మద్యం దుకాణాలు ఏపీత్రయం, గండ్రేడు, జి.మామిడాడ, పెదపూడిలో రెండు ఉన్నాయన్నారు. ఈ దుకాణాలు సమయ పాలన పాటించాలన్నారు. ఈ దుకాణాలకు సంబంధించి గ్రామాల్లో గానీ, దుకాణాల సమీపంలో గానీ ఏలాంటి అక్రమ విక్రయాలు చేపట్టవద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే గ్రామాల్లో అక్రమంగా విక్రయాలు చేపడుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

పెదపూడిలో తులసీమాత, దామోదర కల్యాణం


పెదపూడి జనార్దనస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

పెదపూడి: గ్రామంలో ప్రసిద్ధి చెందిన జనార్దనస్వామి ఆలయ ప్రాంగాణంలో బుధవారం తులసిమాత, దామోదర కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి గోపాలనరసింహాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు కల్యాణక్రతువులు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలు చేశారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, వైద్యుడు చింతపల్లి కామేశ్వరరావు మాట్లాడుతూ అందరిలోను ఆధ్యాత్మిక భావాలు పెంపొదించుకోవాలన్నారు. కార్తిక మాసంలో తులసిమాత, దామోదర పూజలు వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి వారి పూజించాలన్నారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు కల్యాణం తిలకించి పరవశమయ్యారు.

నేడు మండల అధికారులకు శిక్షణ

రంగంపేట: మండల లెవెల్ అధికారులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సాయిబాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ), బ్లాక్ డెవలప్‌మెంట్ ప్లాన్ (బీపీడీపీ)పై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు తప్పకుండా హాజరుకావాలన్నారు.

వన సమారాధనలతో ఐక్యత

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


జి.మామిడాడలో ఉసిరిచెట్టు వద్ద పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: కార్తిక వనసమారాధనలు ఐక్యతకు దోహదం చేస్తాయని, అందరూ ఉత్సాహంగా నిర్వహించుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా కార్తిక వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఉసిరిచెట్టు వద్ద గణపతి, కార్తిక దామోదర పూజలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్తిక వనసమారాధనలు ఐక్యతకు దోహదం చేస్తాయన్నారు. అనంతరం సభ్యులు, చిన్నారులు పాటలు పాడారు. ఆటలు ఆడి, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాడి వెంటకరెడ్డి, ఉపాధ్యక్షుడు పెదిరెడ్ల లచ్చబాబు, సత్తి రవి, ప్రధాన కార్యదర్శి డి.విజయదుర్గ, ఈశ్వర, వైఎస్సార్ సీపీ నాయకులు ద్వారంపూడి వెంకటరెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుట్టకొండలో..

పెదపూడి: కార్తిక వనసమారాధనలు ఐక్యతకు దోహదం చేస్తాయని పుట్టకొండ గ్రామ సర్పంచ్ వల్లు వెంకటరమణ అన్నారు. పుట్టకొండలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద బుధవారం గ్రామస్తులు, భక్తులు సహకారంతో పెద్ద ఎత్తున కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి వెంకటరమణ, గ్రామ పెద్దలు ముందుగా ఉసిరిచెట్ట వద్ద దామోదర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆలయం వద్ద భారీ ఎత్తున కార్తిక వనసమాధన నిర్వహించడం ఆనవాయితీ వస్తుందన్నారు. అన్న సమారాధనకు గ్రామంతోపాటు చింతపల్లి, సంపర, కాండ్రేగుల, కుమారప్రియం, గండ్రేడు, కై కవోలు, గ్రామాల నుంచి ప్రజలు, భక్తులు వచ్చారు.

అంగరంగ వైభవంగా..

- భక్తిశ్రద్ధలతో నరసన్న తెప్పోత్సవం
- తరలివచ్చిన భక్తులు


తెప్పోత్సవంలో భాగంగా హంస వాహనంపై విహరిస్తున్న నరసన్న

మధురపూడి: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామివారి తెప్పోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. కార్తిక మాసంలో క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని స్వామివారి కోనేరులో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ కాంతులు, బాణసంచా కాల్పుల మధ్య వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు. దత్తత దేవస్థానమైన అన్నవరం దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో అర్చక స్వాములు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలంకరించిన హంస వాహనంపై స్వామిని ఆశీనులు చేసి, కోనేరులో మూడుసార్లు విహరింపజేశారు. అనంతరం మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెప్పోత్సవం ముగిసిన తర్వాత స్వామిని తిరిగి ఆలయానికి తీసుకువచ్చే సందర్భంలో స్థానికులు ఇళ్ల ముందు రంగవల్లులు వేసి, హారతులతో స్వాగతం పలికారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రంగరాజ బట్టర్, సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ, అన్నవరం దేవస్థానం అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో ఆదివాసీలు కీలకం


బిర్సా ముండా చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న వర్సిటీ అధికారులు

రాజానగరం: దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో ఆదివాసీలు కీలక పాత్ర పోషించారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. యూనివర్సిటీ సెమినార్ హాలులో బుధవారం గిరిజన స్వావలంబన వేడుకలను ఘనంగా నిర్వహించంఆరు. అటవీ జాతుల స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ బిర్సా భగవాన్‌గా ఆరాధించబడుతున్న ఆ మహనీయుని స్మరించుకుంటూ యూనివర్సిటీలో కార్యక్రమం నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. వనవాసి కల్యాణ ఆశ్రమ్ జాతీయ సలహాదారు పి.స్వామియాజులు మాట్లాడుతూ ఉద్యమంతో పాటు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో కీలకపాత్ర పోషించిన బిర్సా భగవాన్ పుట్టినరోజును జాతీయ గిరిజన స్వావలంబన దినోత్సవంగా 2021లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ఎస్ వరహాలదొర తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు వసూళ్లపై కేసు

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలో అక్రమ బలవంతపు వసూళ్లకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఎస్సై వాసంశెట్టి రవి చంద్రకుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బలభద్రపురం గ్రామానికి చెందిన నక్కా శ్రీనివాస్‌ను ఈ నెల మూడో తేదీన బలభద్రపురం గ్రామానికి చెందిన చింత డ్రేవిడ్ రాజారెడ్డి ఏర్పాటు చేసిన చర్చికు విరాళం ఇవ్వాలని అడిగారు. ఇవ్వకుంటే కేసు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని రాజారెడ్డిపై శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 11 తేదీన అతని అరెస్టు చేసి 12న రాజమహేంద్రవరంలో కోర్టుకు హాజరు పరిచినట్టు తెలిపారు. దీంతో అతనికి 14 రోజులు డిమాండ్ విధించినట్టు తెలిపారు.

అక్రమ అరెస్టు: ఈ అరెస్టు అక్రమ అని రాజారెడ్డి కుమారుడు చింత హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. తన తండ్రి మతమార్పిడులు చేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు కారణంగా కేసు నమోదు చేశారని ఇది అన్యాయం మీడియాకు తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


రంగంపేటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వారోత్సవాలు పురస్కరించుకుని 14న జ్యోతి ప్రజ్వలన, బాలల దినోత్సవం సందర్భంగా గేయాలు, 15న పుస్తక ప్రదర్శన, చిత్రలేఖనం, 16న వ్యాచరచన, మాదక ద్రవ్యాలపై అవగాహన, 17న దేశభక్తి, జానపద గేయాలు, 18న వక్తత్వం, 19న, మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు, అక్షరాస్యతా దినోత్సవం, బహుమతి ప్రదానం ఉంటాయని తెలిపారు. గ్రంథాలయోద్యమ కారులైన అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్.ఆర్.రంగనాథన్, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు స్ఫూర్తి ప్రదాతల సంస్మరణ, మహిళా సాధికారత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో హెచ్ఎం వి.పార్థసారథి, ఉపాధ్యాయులు చేతులమీదుగా 57 గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

బిక్కవోలు మండలంలో..

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు శాఖా గ్రంథాలయాధికారి ఎస్.బాల తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతాయన్నారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శలు, డ్రగ్స్‌పై అవగాహన, పుస్తకాల ప్రాముఖ్యత తెలియజేస్తామన్నారు. 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖ వ్యక్తులు గురించి ప్రసంశలు, 17న రచయితలు సందేశాలు, సెమినార్లు, కవి సమ్మేనాలు, 18న విద్యార్థులకు వివిధ రకాలు పోటీలు, 19న మహిళ సాధికారాపై చర్చ, 20న డిజటల్ గ్రంథాలయపై అవగాహన, బహుమతులు అందజేత వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బిక్కవోలు గ్రంథాలయంలో అధికారి రత్నబాయి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

చిన్న సన్నకారు రైతులకు చేయూత


కాటవరంలో మాట్లాడుతున్న మైనర్ ఇరిగేషన్ అధికారి దుర్గేష్

సీతానగరం: మైక్రో ఇరిగేషన్ ద్వారా చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీ అందించి, చేయూత ఇస్తున్నట్టు జిల్లా మైనర్ ఇరిగేషన్ అధికారి ఎ.దుర్గేష్ తెలిపారు. మార్కెటింగ్, ఉద్యానవన శాఖ సంయుక్తంగా బుధవారం కాటవరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ బిందుసేద్యం యూనిట్లపై చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ కింద రెండు హెక్టార్లు విస్తీర్ణం వరకు గరిష్ఠంగా రూ 2.18 లక్షల సబ్సిడీ అమలు జరుగుతుందన్నారు. కోస్టల్ ప్రాంతంలోనిపెద్ద రైతులు 50 శాతం సబ్సిడీ కింద 2 నుంచి 5 హెక్టార్ల విస్తీర్ణం వరకు గరిష్ఠంగా రూ.3.09 లక్షల సబ్సిడీ పరిమితితో యూనిట్ల ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. కూరగాయలు పండించే రైతులకు సాగు పద్ధతులు, మెళకువలు, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి యాజమాన్యం, వ్యవసాయ పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్ స్ప్రింకర్ విధానం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ ఎం.సునీల్, వినయ్, మండల మైక్రో ఇరిగేషన్ అధికారి శైని తదితరులు పాల్గొన్నారు.

నిత్యం బైబిల్ పఠించాలి


పాస్టర్ వెంకట్రావును సన్మానిస్తున్న సభ్యులు

మధురపూడి: క్రైస్తవులందరూ నిత్యం బైబిల్‌ను పఠించాలని గుంటూరుకు చెందిన పాస్టర్ యాళ్ల వెంకట్రావు అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లిలోని ఎస్సీపేట లూథరన్ చర్చి ఆవరణలో జరుగుతున్న ఉజ్జీవ సభలు బుధవారం రాత్రితో ముగిశాయి. పాకా సురేష్ ఆధ్వర్యంలో సోమ, మంగళ, బుధవారాల్లో వీటిని నిర్వహించారు. కార్యక్రమంలో సంతోష్ రెడ్డి, లూథరన్ మిషన్ గురుమండల అధ్యక్షుడు పాస్టర్ ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మంచి రోజులు


సదస్సులో మాట్లాడుతున్న పట్టాభిరామిరెడ్డి

రంగంపేట: ఆయిల్‌పామ్ సాగు రైతులకు మళ్లి మంచి రోజులు వచ్చాయని పెద్దాపురం పతాంజలి పామాయిల్ కర్మాగారం ఉన్నతాధికారి పట్టాభిరామిరెడ్డి అన్నారు. బుధవారం సింగంపల్లిలో జరిగిన ఆయిల్‌పామ్ సాగుపై రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏడాది కాలంగా టన్ను ఆయిల్‌పామ్ ధర రూ.12 వేల నుంచి రూ.13 వేలు ఉండగా ప్రస్తుతం రూ.19 వేలకు చేరిందని, మరో ఒకటి, రెండు నెలల్లో రూ.20 వేలకు పెరిగే అవకాశం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పామాయిల్ పంటను ప్రోత్సహిస్తున్నాయని ఇందుకోసం పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇస్తున్నాయని ఫ్యాక్టరీ డిప్యూటీ జనరల్ మేనేజర్ రవీంద్రనాథ్ అన్నారు. ఇతర పంటలతో పోలిస్తే పామాయిల్ తోటల సాగు లాభసాటిగా ఉన్న కారణంగా రైతులు ఇతర పంటల నుంచి ఈ పంటకు మల్లాలని ఉద్యానవన శాఖ అధికారి అరవింద్ సూచించారు. పెరిగిన ధరను కొనసాగించాలని రైతులు అధికారులను కోరారు. తెలంగాణతో సమానంగా ఇక్కడ ధర పెరిగేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి పామాయిల్ సాగు రైతుల తరఫున పుట్టా సోమన్న చౌదరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆఫీసర్ పి.సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్రావు, అభ్యుదయ రైతు వేళంగి శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం బాలల దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జీవితంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, క్రీడా పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రథమ బహుమతిని సూరంపూడి వైష్ణవి, ద్వితీయ బహుమతిని పూజిత కై వసం చేసుకున్నారు. అలాగే కబడ్డీ, రన్నింగ్, షాట్‌పుట్ పోటీలు జరిగాయి. డ్రాయింగ్ టీచర్ మాచారమ్మ, ఫిజికల్ డైరెక్టర్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్షీరాబ్ది ద్వాదశి పూజలు


పందలపాకలో తులసి, ఉసిరిలకు చేసిన ప్రత్యేక అలంకరణ

బిక్కవోలు: మండలంలో క్షీరాబ్ది ద్వాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం కార్తిక మాసం ద్వాదశి కారావడంతో భక్తులు ఆలయాల వద్ద ప్రత్యేక పూజులు చేశారు. అలాగే ఇంటి వద్ద తులసి కోటకు పందిరి ఏర్పాటు చేసి, ఉసిరి కొమ్మ తీసుకు వచ్చి, తులసికి ఉసిరికి వివాహం జరిపించారు. అనంతరం ప్రత్యేకలంకరణ చేసి నైవేద్యాలు సమర్పించారు. పందలపాక కట్లమ్మతల్లి ఆలయం వద్ద మహిళలు తులసి, ఉసరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.

వంగలపూడి రీచ్‌లో నిలిచిన ఇసుక తవ్వకాలు


వంగలపూడి రీచ్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై రామ్ కుమార్

సీతానగరం: వంగలపూడి రీచ్‌లో ఇసుక తవ్వకాలు బుధవారం ఉదయం నిలిచిపోయాయి. ఇసుక తవ్వకాలకు వచ్చిన కూలీలు గోదావరి పరివాహక ప్రాంతంలో పొక్లెయిన్‌తో రాత్రి సమయంలో తవ్వకాలు జరిపారని ఆరోపిస్తూ ర్యాంపు నిర్వాహకులను నిలదీశారు. దీంతో ఉదయం 9 గంటల వరకు కూలీలు రాకపోవడంతో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. దీనితో స్టాక్ పాయింట్ వద్ద ఉన్న ఇసుకను లారీలపై ఇసుక తరలించారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరిపి, ట్రాక్టర్లపై స్టాక్ పాయింట్ వద్ద డంపింగ్ చేస్తారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కూలీలతో ర్యాంపు నిర్వాహకులు చర్చలు జరపారు. అనంతరం ఇసుక తవ్వకాల్లో కూలీలు పాల్గొని ట్రాక్టర్లపై ఇసుకను ఎగుమతి చేశారు.

కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయండి

ఉచిత ఇసుకలో అవకతవకలు జరిగితే కంట్రోల్ రూమ్ నెంబర్‌కు ఫోన్ చేయాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ అన్నారు. వంగలపూడి రీచ్‌లో బుధవారం నూతన ఉచిత ఇసుక విధానము–2024 అనే ఫ్లెక్సీని తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై డి.రామ్ కుమార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇసుకలో అవకతవకలు జరిగే డివిజనల్ కంట్రోల్ రూమ్ 0883 2442344, జిల్లా కంట్రోల్ రూమ్ 18004252540కు ఫోన్ చేయాలన్నారు.

పంటల బీమాకు రేపటి వరకే అవకాశం


దివ్యశ్రీ, ఉద్యాన శాఖ అధికారి

రాజానగరం: ప్రభుత్వం అమలుచేస్తున్న పంటల బీమా పథకానికి శుక్రవారం వరకే గడువు ఉందని మండల ఉద్యానశాఖ అధికారి కె.దివ్యశ్రీ అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా అమలవుతున్న ఈ పథకం ద్వారా ఖరీఫ్‌లో అరటి, రబీలో జీడిమామిడి పంటలకు బీమా సదుపాయం కల్పించారన్నారు. ఈ నెల ఒకటి నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం వాటిల్లితే ఏపీఎస్‌డీపీఎస్ ఇచ్చే నివేదికను అనుసరించి పంటల బీమా వర్తిస్తుందన్నారు. జిల్లాలో జీడిమామిడి పంటలకు బీమా చేసేందుకు ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని ఎంపిక చేశారని చెప్పారు. మూడేళ్లు దాటిన జీడిమామిడి పంటలకు ఎకరాకు రూ.1500 బీమా ప్రీమియాన్ని రైతులు చెల్లిస్తే, రూ.30 వేల బీమా వర్తిస్తుందని వివరించారు. కస్టమర్ సర్వీస్ సెంటర్లు, బ్యాంకులు, ఎన్‌సీఐపీ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు తీసుకున్నా, తీసుకోకపోయినా అర్హులేనన్నారు. ఆసక్తి కలవారు వ్యవసాయ, ఉద్యాన విభాగాల గ్రామ సహాయకులను సంప్రదించాలని, లేదా 92900 33325 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

ముగిసిన ఏకాహం


రంగంపేట శివాలయంలో ఏకాహం నిర్వహిస్తున్న భజన సమాజ సభ్యులు

రంగంపేట: లోక కల్యాణం కోసం ఏటా ఏకాహ భజనలు నిర్వహిస్తున్నామని శ్రీదేవీ బాల భక్త భజన సమాజ గురువు పోతుల వీర సుందర రావు (వీరన్న) అన్నారు. భక్తులలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించడం కోసం ఇటువంటి ఏకాహ భజనలు దోహదపడతాయని అన్నారు. స్థానిక మంచినీటి చెరువు వద్ద కొలువైన ఉమారామలింగేశ్వరస్వామి దేవాలయంలో అఖండ భజన కార్యక్రమం నిర్వహించినట్టు మంగళవారం కార్తిక మాస శుద్ధ ఏకాదశి సందర్భంగా ఈ అఖండ భజన కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున 4.30 గంటల నుంచి బుధవారం ద్వాదశి రోజు తెల్లవారు జామున 4.30 గంటల వరకూ భజనలు జరగాయన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, శివ, అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన


గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

బిక్కవోలు: బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులు శివరామన్న ఇండియన్ గ్యాస్ కంపెనీ వారు గ్యాస్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం గ్యాస్ కంపెనీ అధినేత తమలంపూడి చిన్నారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ ఇంటి వద్ద తల్లిదండ్రులు గ్యాస్ వాడకంపై జాగ్రత్తలు, సూచనలు, సలహాలు తెలపాలన్నారు. గ్యాస్ పొదుపుగా వాడడం వల్ల కలిగే ఫలితాలు తెలిపారు. అనంతరం వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలోని పాఠశాల హెచ్ఎం పళ్లా వీరప్రభాకర్, ఉపాధ్యాయుడు జంగా ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

చినకొండేపూడిలో చోరీ

సీతానగరం: మండలంలోని చినకొండేపూడిలో జరిగిన దొంగతనంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీలగిరి రాజేష్ మంగళవారం తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామంలో తన తమ్ముడు వివాహానికి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం ఇంటికి వచ్చాడు. లోపలకు వెళ్లేసరికీ బీరువా తెరచి ఉంది. దానిలోని అరకాసు బంగారు ఉంగరం, దుద్దులు, రూ.50 వేలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పల బాధతో వ్యక్తి మృతి

సీతానగరం: అప్పుల బాధ తట్టుకోలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కాటవరానికి చెందిన రామకుర్తి సత్యనారాయణ (51) అప్పుల బాధ తట్టుకోలేక మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు గడ్డిమందు తాగాడు. అతడిని వెంటనే కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 10 గంటలకు మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పాలచర్ల పీహెచ్‌సీ పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధర

రాజానగరం: జిల్లాను క్షయ వ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు వైద్యులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా అదనపు వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర అన్నారు. మండలంలోని పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. టీబీ బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న నిక్షయ్ పోషణ యోజన (డీబీటీ) అందుతున్న తీరుపై ఆరా తీశారు. టీబీ, లెప్రసీ, హెచ్ఐవీ కేసుల ల్యాబ్ రిజిస్టర్లు, రికార్డులను, రోగుల వివరాలు, కార్డులను పరిశీలించారు. టీబీ కేసులు తక్కువగా నమోదు కావడంపై ప్రశ్నించారు. అక్కడున్న టీబీ రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు.

ఫ్యాన్సీ సిమ్‌ల పేరుతో మోసం

సీతానగరం: ఫ్యాన్సీ నంబర్లు ఇస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఎస్సై రామ్‌కుమార్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. సీతానగరానికి చెందిన వైవీ రామకృష్ణకు ఆరు నెలల క్రితం సామాజిక మాధ్యమంలో ప్రకాశం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. అతడు ఫ్యాన్సీ నంబర్లు గల సిమ్‌లు ఇస్తానని రామకృష్ణకు చెప్పాడు. దాని కోసం రూ.4 వేలను ఫోన్ పే ద్వారా వేయించుకున్నాడు. కానీ సిమ్‌లు ఇవ్వకపోవడతో రామకృష్ణ పోలీసులను ఆశ్రయించాడు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ

రాజానగరం: మండలంలోని నరేంద్రపురంలో బుధవారం రాత్రి మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మల కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పలువురు గ్రామస్తులు విచ్చేశారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

రాపాక సర్పంచ్ మృతి

సీతానగరం: మండలంలోని రాపాక సర్పంచ్ గన్నిన బ్రహ్మాజీ (50) బుధవారం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి పార్టీలకతీతంగా పలువురు సంతాపం తెలిపారు.

కలవచర్లలో రెవెన్యూ సభ

రాజానగరం: రీసర్వేలో జరిగిన లోటుపాట్లను సరిచేసేందుకే రెవెన్యూ గ్రామసభలను నిర్వహిస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. కలవచర్లలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 15 మంది రైతులు రీసర్వేకు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీలావణ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.